క్లుప్తంగా...

రేపు 'ఆయుష్మాన్ భవ'

సనత్‌నగర్: అమీర్‌పేట-బల్కంపేట రోడ్డులోని అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జనరల్ హాస్పిటల్)లో ఈ నెల 22న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ దశరథ్, ఆర్‌ఎంఓ డాక్టర్ వినాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిపుణులైన వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందులో గర్భ సంబంధిత, పిల్లల వైద్యం, శస్త్ర చికిత్స, చెవి, ముక్కు, గొంతు, కన్ను, మానసిక వ్యాధులకు సంబంధించిన వైద్యులు హాజరవుతారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సనత్‌నగర్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సనత్‌నగర్ ఎస్‌ఆర్టీకాలనీకి చెందిన ఫయాజ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బుధవారం మంత్రి అందజేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగడం మనందరి అదృష్టమన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి అది చేస్తాం..ఇది చేస్తామనే ప్రతిపక్ష నాయకుల మాటలను తిప్పికొట్టాలన్నారు. కొలను బాల్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాయన్న చొరవతోనే డబుల్ ఇళ్లు

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతోనే తమకు డబుల్ బెడ్రూమ్ దక్కాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో డబుల్ బెడ్రూమ్‌లు దక్కిన కంటోన్మెంట్‌లోని పలువురు లబ్ధిదారులు బుధవారం కార్ఖానాలోని సాయన్న నివాసానికి వచ్చి నివేదితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్ శ్రీనివాస్, గౌస్, రవూఫ్, మల్లేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ పునరుద్ధరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ అజీజ్ జమాలుద్దీన్ కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం పునరుద్ధరించారు. రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టిన ల్యాబ్‌ను వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, ఇతర అధికారులతో పాటు పూర్వ విద్యార్థులు మేరెడ్డి రవిప్రకాష్, ఎన్‌ఆర్‌ఐ మారోజు వెంకట్ పాల్గొని ప్రసంగించారు.

వారాసిగూడలో పోలీస్ కవాతు

చిలకలగూడ: వినాయక నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణకు చిలకలగూడ, వారాసిగూడ పరిధిలో సాయుధ పోలీసులు బుధవారం కవాతు (ఫ్లాగ్‌మార్చ్) నిర్వహించారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విభిన్నమైన గన్స్, వెపన్స్‌తో నిర్వహించిన సాయుధ బలగాల కవాతు అసాంఘిక శక్తుల ఆట కట్టించేలా కొనసాగింది. చిలకలగూడ, సీతాఫల్‌మండి, నామాలగుండు, వారాసిగూడ, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, నేతాజీనగర్‌చౌరస్తా, మొరంబంద, పార్శిగుట్ట మీదుగా సాగిన కవాతులో ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, అడిషనల్ డీసీపీ పృథ్వీరాథ్, ఏసీపీలు జైపాల్‌రెడ్డి, బాలగంగిరెడ్డి, కస్తూరి శ్రీనివాస్, సైదులు, సీఐలు మట్టంరాజు, సరికొండ శంకర్, మధులత, ఎస్‌ఐలు సుధాకర్‌లతోపాటు సుమారు ఐదు వందల మంది సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

అక్టోబర్‌లో విద్యార్థి, నిరుద్యోగుల ప్రజా కోర్టు

ఉస్మానియా యూనివర్సిటీ: అక్టోబరు మొదటి వారంలో విద్యార్థి, నిరుద్యోగుల ప్రజా కోర్టును ఓయూలో నిర్వహించనున్నట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. రాష్ట్ర అవతరణ అనంతరం వర్సిటీల పరిస్థితులు, ఉద్యోగాల భర్తీ, గ్రూప్-1 పేపర్ లీకేజీ, రైతుల ఆత్మహత్యలు, లిక్కర్ స్కామ్, ధరణి పోర్టల్ బాధలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ చేసిన మోసాలు, అన్యాయంపై ఆర్ట్స్ కాలేజీ ఎదుట అక్టోబరు ఎదుట ప్రజా కోర్టును ఏర్పాటు చేసి భవిష్యత్ ప్రణాళికను ప్రకటిస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. రియాజ్, లోకేష్‌యాదవ్, బాలలక్ష్మీ, గడ్డం శ్రీనివాస్, కోట శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్ రెడ్డి, వెంకట్‌నాయక్, శేషయాదవ్, సత్య, మెడ శ్రీను, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులకు స్పందిస్తున్నాం.. సమస్యలు పరిష్కరిస్తున్నాం!

వార్డు కార్యాలయాల పనితీరు భేష్
- పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వెల్లువిరిసేలా చర్యలు
- ట్యాక్స్ వసూళ్లు వేగవంతం
- 'సాక్షి'తో బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్


ఎన్. శంకర్, డిప్యూటీ కమిషనర్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బేగంపేట్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్ చెప్పారు. కాప్రా సర్కిల్ నుంచి బదిలీపై బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకర్ సర్కిల్ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ట్యాక్స్ వసూళ్లు, బస్తీల్లో చెత్తాచెదారం తొలగింపు, పార్కుల ఆధునికీకరణ, వీధిదీపాల ఏర్పాటు, నూతన రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై 'సాక్షి' ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రశ్న: జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పనితీరు గురించి..

డిప్యూటీ కమిషనర్: బేగంపేట్ సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో పౌర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు, చెత్తాచెదారం తొలగింపు, పార్కుల సుందరీకరణ, అక్రమ కట్టడాల తొలగింపు, దోమల నివారణ వంటి అనేక పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిప్యూటీ కమిషనర్: పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, కార్మికులతో కలిసి రోడ్లు, కాలనీలు, బస్తీల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సుమారు 700 మంది సిబ్బందితో కలిసి పారిశుద్ధ్యంపై పని చేస్తున్నాం.

ప్రశ్న: వార్డు కార్యాలయాల పనితీరు ఎలా ఉంది.

డిప్యూటీ కమిషనర్: బేగంపేట్ సర్కిల్ పరిధిలో వార్డు కార్యాలయాలకు స్పందన వస్తోంది. బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు కార్యాలయాలు బాగా పనిచేస్తున్నాయి. ప్రజా సమస్య పరిష్కారం కోసం ప్రధాన కార్యాలయం చుట్టూ తిరిగే పని లేకుండా అక్కడిక్కడే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి.

ప్రశ్న: బేగంపేట్ సర్కిల్ పరిధిలో ట్యాక్స్ వసూళ్ల తీరుతెన్నులు..

డిప్యూటీ కమిషనర్: బేగంపేట్ సర్కిల్ పరిధిలో ట్యాక్స్ వసూళ్ల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ట్యాక్స్ అధికారులతో పాటు ఇతరత్రా విభాగాల సిబ్బందిని ఇందు కోసం వినియోగిస్తూ ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో తమ సర్కిల్ ట్యాక్స్ వసూళ్ల లక్ష్యం రూ.72 కోట్లు కాగా ఇప్పటికే 80 శాతం పూర్తి చేశాం.

ప్రశ్న: అక్రమ కట్టడాల విషయంలో తీసుకుంటున్న చర్యలు.

డిప్యూటీ కమిషనర్: ఇళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలో అనుమతులు ఇస్తున్నాం. ఎక్కడ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా నిబంధనలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేస్తున్నాం. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు సాగించే వారికి ముందస్తు నోటీసులిచ్చి కూల్చివేతలు చేపడుతున్నాం. అక్రమ నిర్మాణాలపై వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: జీహెచ్‌ఎంసీ అధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్ల నిర్వహణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి వాటి గురించి.

డిప్యూటీ కమిషనర్: పేద, మధ్య తరగతి వర్గాల సౌకర్యార్థం తక్కువ అద్దెలతో బన్సీలాల్‌పేట్, మారేడ్‌పల్లి ప్రాంతాల్లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు నిర్మించడం జరిగింది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేస్తున్నారు. ముందుగా వచ్చిన వారికి అలాట్ చేస్తున్నారు. నిర్వహణ తీరుతెన్నులపై ప్రజలు నిర్దిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.మరిన్ని వసతులు కల్పించి వాటి నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం.

పారదర్శకంగా 'డబుల్' ఇళ్ల కేటాయింపు

డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న పద్మారావు గౌడ్

చిలకలగూడ : ప్రభుత్వ పథకాల అమలులో దళారీల ప్రమేయం ఎంతమాత్రం సహించమని, ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'డబుల్' ఇళ్ల కేటాయింపులను పారదర్శకంగా చేపట్టామని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 500 అర్హులైన లబ్ధిదారులకు తొలి విడతలో అహ్మద్‌గూడలో డబుల్ ఇళ్లు కేటాయించగా, మలి విడతలో మరో 500 మందికి లాటరీ ద్వారా జవహర్‌నగర్‌లో ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. గురువారం జరిగే కార్యక్రమంలో జవహర్‌నగర్‌లో డబుల్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.

- సీతాఫల్‌మండి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.1.10 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సీతాఫల్‌మండి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు.

వ్యక్తికి జైలుశిక్ష


శివాజీ

అమీర్‌పేట: అమీర్‌పేటలో రాత్రి సమయంలో హోటల్ నిర్వహిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష విధించారు. ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన ఎస్.శివాజీ (19) మైత్రీవనం సమీపంలో రాత్రంతా హోటల్ నిర్వహిస్తుండటంతో పోలీసులు ఈ- పెట్టి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా పదో మెట్రోపాలిటన్ స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి కె.లలిత 2 రోజుల జైలు శిక్ష, రూ.1050 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గౌడవెల్లికి చెందిన దిల్‌కుమారి పరియార్(71) బుధవారం మధ్యాహ్నం మేడ్చల్-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో వెనక నుంచి దూసుకొచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సీ సెక్షన్‌కు చెందిన ఫిలిపిన్ (19) ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తన ప్రేమ విఫలం కావడంతో కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న ఫిలిపిన్ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

వైద్యులు నిర్దేశించిన మోతాదులోనే ఔషధాలు తీసుకోవాలి


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రోగుల సహాయకులు

అమీర్‌పేట: రోగికి మందులు ఇస్తున్న సమయంలో వాటిని నిశితంగా పరిశీలించాలని డా. గీతాంజలి అన్నారు.ప్రపంచ రోగి సురక్షిత రోజును పురస్కరించుకుని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రోగులకు వైద్యులు సిఫార్సు మేరకు మందులు ఇవ్వడమే కాకుండా ఎక్స్‌పైరీ డేట్‌ను చూసుకోవాలన్నారు. వైద్యులు నిర్దేశించిన మోతాదులోనే మందులు తీసుకోవాలని, త్వరగా జబ్బు నయం కావాలనే ఆత్రుతతో మోతాదు పెంచరాదని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

అధ్యాపకుల ఆందోళనలను అడ్డుకున్న పోలీసులు


మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం విధుల బహిష్కరించి పెన్‌డౌన్, చాక్‌డౌన్ నిరసన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకుల చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో 12 వర్సిటీల అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మహిళా వర్సిటీ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లేందుకు అధ్యాపకులు యత్నించగా పోలీసులు గేటును మూసి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన అధ్యాపకులు అక్కడే బైఠాయించి ఉద్యోగాలను పర్మనెంట్ చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపేందర్‌రావు, నర్సింహారావు, శేఖర్‌రెడ్డి, వేల్పుల కుమార్, ధర్మతేజ, విజేందర్‌రెడ్డి, దీపిక, స్రవంతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుమార్తెతో సహా మహిళ అదృశ్యం


కుమార్తెతో గాయత్రి

కంటోన్మెంట్: సొంతూరికెళ్లే విషయంలో భర్తతో గొడవ పడిన మహిళ కూతురిని తీసుకుని అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజన్న సిర్సిల్ల జిల్లా కొత్తపల్లికి చెందిన ఆనంద్ (36), భార్య గాయత్రి (32)కూతురితో బోయిన్‌పల్లిలోని చిన్నతోకట్టాలో ఉంటున్నాడు. ఈ నెల 17న వినాయక చవితి సందర్భంగా సొంతూరుకెళ్దామని ఆనంద్, గాయత్రికి చెప్పగా తాను రానని చెప్పడంతో ఇద్దరిమధ్య గొడవ జరిగింది. అనంతరం ఆనంద్ ఒక్కడే బయలుదేరాడు. మార్గమధ్యలో భార్యకు ఫోన్ చేయగా స్పందించలేదు. పక్కింటి వారితో ఆరా తీయగా తాళం వేసి ఉన్నట్లు తెలిపారు. మంగళవారం ఆనంద్ వచ్చే సరికి, గాయత్రి ఇంట్లో లేదు. కుటుంబ సభ్యులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'చేతులు' కలిసిన వేళ


కరచాలనం చేసుకుంటున్న నాగులూరి, నోముల

చిలకలగూడ : ఇటీవల కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ అసెంబ్లీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అభ్యర్థిత్వం కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు సైతం చేసుకున్నారు. అధిష్ఠానంతో పాటు ప్రజాబలం మెండుగా ఉంది. ఇద్దరూ పారిశ్రామిక, ఆధ్యాత్మికవేత్తలు. సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ఫౌండర్ చైర్మన్లు వారే నాగులూరి సాయిబాబా, నోముల ప్రకాశరావు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు సందీప్‌రాజ్ బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఇద్దరూ మొదటిసారిగా కలుసుకుని పరస్పరం పలకరించుకున్నారు. టికెట్ ఆశిస్తున్న ఇద్దరు కాంగ్రెస్ నాయకులు కలుసుకోవడంతో సికింద్రాబాద్‌లో హస్తం గుర్తు హవా కొనసాగుతుందని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు


సుదర్శన్

కంటోన్మెంట్: డ్యాన్స్ నేర్చుకునేందుకు వచ్చిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. బోయిన్‌పల్లి పోలీసుల వివరాల మేరకు.. బోయిన్‌పల్లి జూపిటర్ కాలనీలో ఉండే సుదర్శన్ (36) అదే కాలనీలో అర్బన్ డ్యాన్స్ వరల్డ్ పేరిట స్కూల్ నిర్వహిస్తున్నాడు. 2021 మార్చిలో డ్యాన్స్ నేర్చుకునేందుకు ఓ మైనర్ బాలిక వచ్చింది. బాలిక ఇన్‌స్టాగామ్ రీల్స్ చేయడం గమనించిన సుదర్శన్, తనతోనూ రీల్స్ చేయాల్సిందిగా బలవంతం చేశాడు. ఈ క్రమంలో బాలికను డ్యాన్స్ స్కూల్‌లోని మరో గదిలోకి తీసుకెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఫిర్యాదు చేశారు. సుదర్శన్‌పై కేసు నమోదు చేయగా విచారించిన నాంపల్లి 12వ ఎంఎస్‌జే, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.7 వేల జరిమానా విధించారు.

ఎట్టకేలకు 'డబుల్' దరఖాస్తుల పరిశీలన

- తొలి రెండు విడతల్లో కంటోన్మెంట్‌కు దక్కింది 500 ఇళ్లే
- వెరిఫికేషన్‌లో ఆలస్యం అంటున్న అధికారులు

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో డబుల్ ఇళ్ల వెరిఫికేషన్ ప్రక్రియలో కదలిక వచ్చింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న అన్నచందాన లాగా కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ నేతలు ఆలస్యంగా తేరుకున్నారు. తమ వార్డుల పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్లు దక్కే అవకాశాన్ని వదులుకుంటే అపవాదులు తప్పవని భావించి బోర్డు మాజీ సభ్యులూ రంగంలోకి దిగారు. తొలి విడతలో నగరంలోని అన్ని నియోజకవర్గాలకు 500 చొప్పున ఇళ్లు కేటాయించగా, కంటోన్మెంట్‌లో మాత్రం 200 మందికే దక్కాయి. 75 మంది మోండా డివిజన్ పరిధిలో ఉండగా, 50 మంది ఒకటో వార్డుకు చెందిన వారే ఉన్నారు. స్థానిక బోర్డు ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఒకటో వార్డు పరిధిలోని మరో 75 మందికి రెండో విడతలోనూ ఇళ్లు దక్కాయి. దీంతో మిగతా వార్డుల నేతలపై ఒత్తిడి పెరిగింది. బోర్డు అధికారులపై ఒత్తిడి పెంచి తమ వార్డుల్లోనూ వెరిఫికేషన్ పూర్తి చేయించాలని కోరారు. ఎట్టకేలకు బోర్డు అధికారులు కొందరు సిబ్బందిని కేటాయించారు.

ఆరో వార్డులో మొదలైన వెరిఫికేషన్

బుధవారం ఆరోవార్డు పరిధిలోని సీతారాంపూర్‌లో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ ప్రక్రియ చేయించారు. ఒకే రోజు సుమారు 75 మందికి సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ పూర్తయింది. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత ఈ శిబిరాన్ని సందర్శించి వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. వీలైనంత త్వరితగతిన అన్ని వార్డుల్లోనూ దరఖాస్తుదారుల వెరిఫికేషన్ పూర్తిచేయాలని బోర్డు సిబ్బందిని కోరారు. గురువారం ఆరోవార్డు నందమూరి నగర్‌లో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పాండయాదవ్ తెలిపారు. ఆరోవార్డు పరిధిలోని దరఖాస్తు దారులు ఈ కేంద్రాన్ని సందర్శించి, తమ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించకుంటే వైద్యసేవలు నిలిపివేస్తాం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు నిలిపివేస్తామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ప్రతినిధులు హెచ్చరించారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం వైద్యగర్జన పేరిట నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యులు ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే నిరసన, ఆందోళన కార్యక్రమాలు మరింత ఉద్ధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలను నిలిపివేస్తామన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రవీణ్, లాలుప్రసాద్, నరహరి, సుబోధ్, వినోద్, రంగా, నర్సింహారావునేత, రవి, అబ్బయ్య, జానకీ, శ్రీదేవి, శేఖర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'


రాంగోపాల్‌పేట్‌లో పర్యటిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

రాంగోపాల్‌పేట్: ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణా ప్రజల్లో అనూహ్య స్పందన వస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని రాంగోపాల్‌పేట్, నల్లగుట్ట, ఎంజీరోడ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి తమ పార్టీ పథకాల గురించి వివరిస్తున్నామని ఇప్పటికే ఈ పథకాల గురించి తెలిసిన వారు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నారన్నారు. మహిళలు కాంగ్రెస్ పార్టీ పట్ల మరింత ఎక్కువ అభిమానం చూపిస్తున్నారని త్వరలో జరుగబోయే ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇంటింటి పాదయాత్ర..

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీల అమలుతో పేదల తలరాతలు మారనున్నాయని సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఇంటింటి పాదయాత్ర చేసి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ప్రజా సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అధికారంతోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తోట మణిమాల, రమేష్, కమల్‌రాజ్ పాల్గొన్నారు.

పిల్లలు, తల్లుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం


సదస్సును ప్రారంభించిన డాక్టర్ సంగీతారెడ్డి

అమీర్‌పేట: పిల్లలు, తల్లుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్స్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. అమీర్‌పేట హోటల్ మ్యారీ గోల్డ్‌లో ఫీటల్ మెడిసిన్ 'ఆప్టిమైజింగ్ ఫీటల్ ఫలితాల-2023'రెండో ఎడిషన్‌ను సదస్సును బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్యం ఉన్న నియోనాటల్ ఫీటల్ మెడిసిన్ నిపుణుల కలయికతో మనకు అందుబాటులో ఉన్న అత్యుత్తమ యంత్రాలతో అద్భుతమైన అవగాహన కల్పిస్తున్నాయన్నారు. 1.8 లక్షల మంది పిల్లలు పుట్టుకతో వైఫల్యాలతో పుడుతారనే అంచనా ఉందన్నారు. ప్రోయాక్టీవ్ స్కీనింగ్ ప్రోటోకాల్‌ల వైపు మనం ముందుకు సాగాలని ఫిజికల్ స్క్రీనింగ్, బ్లడ్ ప్రెజర్, జెనెటిక్స్‌తో సహ ఇతర పరీక్షల కలయికను కచ్చితమైన ప్రోటోకాల్ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు కృష్ణన్ మనికందన్, లక్ష్మీ రవి, కృష్ణగిరి, బాలాంబ, మాధవీలత పాల్గొన్నారు.

ఘనంగా వెల్లాల రామ్మోహన్ జన్మదిన వేడుకలు


వెల్లాల రామ్మోహన్‌కు కేక్ తినిపిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

సనత్‌నగర్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు సనత్‌నగర్‌లోని కార్యాలయానికి భారీగా తరలివచ్చి వెల్లాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితం ప్రజా సంక్షేమం కోసమేనని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పేద ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. మతాలకతీతంగా ఆర్థింగా ఎదిగేందుకు వైఎస్‌ఆర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, అభిలాష్‌రెడ్డి, చలం, మణిదీప్, శ్రీకాంత్ యాదవ్, కళ్యాణ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి


రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశమైన ఎన్నికల అధికారులు

చిలకలగూడ : ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని రిటర్నింగ్ అధికారి యెల్లారెడ్డి కోరారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్, ఈఆర్‌ఓ సుధాంశ్ నేతృత్వంలో బుధవారం పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బూత్‌లెవల్ ఏజంట్ల జాబితాను అందించాలని ఆయా పార్టీల నాయకులను కోరారు. ఓటరు నమోదు తీరుతెన్నులను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరగా, అందుకు తగిన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశామని, రూట్ వారీగా సెక్టోరల్ ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓ హేమలత, ఎన్నికల సెక్షన్ ఇన్‌చార్జి భుజేందర్‌బాబు, నాయకులు వల్లారపు శ్రీనివాసరావు, ప్రకాశ్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, రాజుసుందర్, నర్సింగరావు, శ్యామ్ పాల్గొన్నారు.



కథనం చదివి.. సమస్య పరిష్కారానికి కదిలి

గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



బన్సీలాల్‌పేట్: వర్షాల కారణంగా ధ్వంస మైన రోడ్లపై జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. సికింద్రాబాద్ పరిసరా ల్లోని పద్మారావునగర్, బన్సీలాల్‌పేట్, గొల్లకొమురయ్య కాలనీ, చాచానెహ్రూ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై ఈ నెల 17న 'అడుగుకో గుంత..వెళ్లేదెట్లా' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. గుంతల మయంగా మారిన రోడ్లను గుర్తించి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి ఆయా ప్రాంతాల వారు కృతజ్ఞతలు తెలిపారు.